జల సవ్వడి ఏది?

- తగ్గిన భూగర్భ జలాలు
- అడుగంటిన బావులు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు


నీరులేక ఎండిపోయిన శేషమ్మ చెరువు

అయిజ: మండలంలోని వివిధ గ్రామ శివార్లలోని చెరువులు ప్రతి ఏడాది వానాకాలంలో నీటితో నిండి అలుగు పారుతూ కళకళలాడేవి. ఈ యేడాది వానాకాలం ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లోకి చుక్క నీరు చేరని పరిస్థితి దాపురించింది. నిండు కుండలా నీటితో కళకళ లాడాల్సిన చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. సరైన వర్షాలు కురవకపోవడంతో బావులు ఎండిపోయాయి. బోరుబావుల్లో సైతం భూగర్భ జలాలు తగ్గిపోయాయి. మండలంలో బి.తిమ్మాపూర్ శివారులో శేషమ్మ చెరువు, ఉత్తనూరు శివారులో న్యూ ట్యాంక్ చెరువులు ఉన్నాయి. అయిజ శివారులో కొత్త చెరువు, ఎక్లాస్‌పురం శివారులో ఆచార్యుల చెరువు, ఎర్రకుంట, నల్లకుంట చెరువులు ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో మిషన్ కాకతీయ పనులు చేపట్టి చెరువు పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు. చెరువు ఆయకట్టులో రైతులు పంటలు పండించుకునే వారు. అయితే వర్షాభావ పరిస్థితులతో చెరువులో నీరు లేకపోవడంతో కాలక్రమేనా చెరువు ఆయకట్టు భూములు బీడు భూములుగా మారిపోయాయి.


తిమ్మాపూర్ శివారులో వర్షాభావంతో గిడసబారిన పత్తి పంట

ఎండుముఖం పట్టిన పంటలు...

నెల రోజుల నుంచి సరైన వర్షాలు కురవకపోవడంతో వివిధ పంటలు ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. గత వారంలో మండలంలోని వివిధ గ్రామాల శివార్లలో అక్కడక్కడ కొద్దిపాటి వర్షం కురిసింది. దాంతో ఎండుతున్న పంటలకు కాస్త ఊపిరిపోసినట్లయ్యింది.

సాగుచేసిన పంటలు...

మండలంలో మొత్తం 57,637 ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉండగా.. 11,036 ఎకరాలు సాగుకు ప్రతికూలంగా ఉంది. అయితే ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50,000 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుచేశారు. జూన్ నెలలో అడపాదడప కురిసిన వర్షాలకు 12,404 ఎకరాల్లో కంది, 6,830 ఎకరాల్లో ఆముదం, 8,901 ఎకరాల్లో వేరుశనగ, 20,123 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. సుమారు 2,000 ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేశారు. వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి.

చెరువులోకి నీరుచేరలేదు..



వానాకాలం వచ్చి నెల రోజులు పూర్తయినా ఇంతవరకు చెరువులు కుంటలు నిండలేదు. ప్రతి సంవత్సరం ఏరువాక పున్నమికంటే ముందే నదులు నిండుగా పారేవి. బావులు, బోరుబావుల్లో నీటి ఊట పెరిగేది. ఈ యేడాది బోరుబావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. దాంతో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

– రమేష్, రైతు, అయిజ

పంటలు ఎండిపోతున్నాయి



వానాకాలంలో సాగుచేసిన పంటలు వర్షాలు లేకపోవడంతో ఎండిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. భూమిలో తేమశాతం తక్కువగా ఉండటంతో రైతులు ముందుగా సాగుచేసిన పత్తి, వేరుశనగ, కంది పంటలు ఎదుగుదల లేక గిడసబారిపోయాయి. వర్షాధారంపై పంటను సాగుచేసిన రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది.

– భీమేష్, రైతు, అయిజ

ధరూరులో భారీ వర్షం


ధరూరులో కురుస్తున్న వర్షం

ధరూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వాన దంచి కొట్టింది. సాయంత్రం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు గంట పాటు కుండపోత వాన పడింది. మొన్న శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పాటు నేడు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. పంటలకు కూడా ఈ వర్షాలు జీవం పోసినట్లయ్యాయి. వానాకాలం పంట సాగులో భాగంగా వరి పంట సాగు చేసుకునే రైతులకు కరిగెట చేసుకునేందుకు అనుకూలంగా మారిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విత్తనాలు వేసుకున్న రైతులకు ఈ వాన అనుకూలంగా మారింది. అలాగే నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లు వేసుకునేందుకు కరిగెట చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్.. పేదలకు వరం


చెన్నిపాడులో అలీమ్‌బీకి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలకు అందిస్తుందన్నారు. మద్దూరు లక్ష్మన్నకు రూ.21 వేలు, రాజ్‌కుమార్‌కు రూ.60,000, చిన్నపోతులపాడులో మద్దిలేటికి రూ.12,000, చెన్నిపాడు మాదిగ బీసన్నకు రూ. 21,000, పి.అలీమ్‌బీ రూ.12,000, పెద్దఆముదాలపాడులో జి. నరసింహులు రూ.20,000, నారాయణపురంలో పి.శివమ్మకు రూ.14,000, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు రోడ్డు నిర్మాణానికి సంబంధించి వినతి పత్రం అందించారు. అదేవిధంగా చెన్నిపాడు గ్రామం నుంచి కొర్విపాడు స్టేజీకి వెళ్లే మట్టి రోడ్డు కోసం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు జ్ఞానేశ్వర్‌రెడ్డి, తిరుమాల్‌రెడ్డి, రాజారెడ్డి, రఘురెడ్డి, మద్దిలేటి వినతి అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో గంజిపేటలోని సబ్‌స్టేషన్‌లో రిలే మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌లు మార్పు చేయనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ గద్వాల టౌన్ ఏఈ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, బుర్దపేట, సుంకులమ్మమెట్టు, గాంధీచౌక్, కృష్ణారెడ్డి బంగ్లా, రాజావీధి ఏరియాలకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భగవద్గీత ప్రచారం



అయిజ: గురు పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని భరత్‌నగర్‌లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడారు. ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి తెలుసుకొనుటతో మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ వేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు దీపిక, సుభద్రమ్మ, అనంతమ్మ, జములమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ప్యాచ్‌లు

- ప్రమాదాల బారిన ప్రయాణికులు



శాంతినగర్ : గుంతలమయమైన రోడ్డుకు ప్యాచ్‌లు వేయగా.. నెలరోజులకే పరిస్థితి మొదటికొచ్చింది. దీంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వడ్డేపల్లి పట్టణ సమీపంలోని పైపాడు స్టేజీ నుంచి కలుకుంట్ల వరకు అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారి గుంతలమయమై ప్రయాణానికి నరకంగా మారింది. గతంలో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. తూతూమంత్రంగా చేపట్టిన పనులతో 15 రోజులకే ప్యాచ్‌లకు వేసిన కంకర తొలగిపోయింది. గతంలోని గుంతలు తిరిగి ప్రత్యక్షమయ్యాయి. అంతేగాక దశాబ్దాల కిందట నిర్మించిన సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడంతో రెండు వైపుల ఎగుడుదిగుడుగా ఉంది. దీంతో డబుల్‌లైన్ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తరచూ అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎగుడుదిగుడు రోడ్డుతో సతమతమవుతుంటే రోడ్డు గుంతలమయంగా మారడంతో గుంతలు తప్పించబోయి వాహనాలు ఢీ కొంటున్నాయి. మూడు కిలోమీటర్ల రహదారిలో ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రెండు కిలోమీటర్ల మేర అధ్వానంగా మారిన రహదారిని పూర్తిస్థాయిలో నిర్మించి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు



నిర్మాణం పూర్తయిన వైకుంఠధామం

- అంతిమ సంస్కారాలకు ముందుకురాని కుటుంబ సభ్యులు

కేటీదొడ్డి: గ్రామాల రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పల్లెప్రగతిలో గ్రామాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి, శాశ్వత పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంది. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం నిధులతో వైకుంఠాధామాలు నిర్మాణాలు చేపట్టారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలకు గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మాణాలు పూర్తయ్యాయి.

మండలంలో 23 గ్రామాల్లో...

మండలంలోని 23 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో వైకుంఠాధామాలు పూర్తయ్యాయి. వీటి కోసం ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నుంచి 12.60 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పనులను శరవేగంగా పూర్తి చేయించారు.

ముందుకు రాని కుటుంబ సభ్యులు

వైకుంఠాధామాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ఎవరైనా మృతిచెందితే దహన సంస్కారాలకు ముందుకు వస్తే అధికారులే ఉచితంగా కట్టెలతో పాటు నీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఐనప్పటికీ చాలా మంది వారి ఆచారాలను అనుసరించి మృతదేహాన్ని కాల్చేందుకు ముందుకు రావడం లేదు. అధికారులు ఎంత ప్రయత్నించినా.. వైకుంఠధామాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకరాలేకపోతున్నారు.

అవగాహన కల్పించాలి..



గ్రామాల్లో వైకుంఠధామాలను దహనసంస్కారాలకు ఉపయోగించుకోవడం కోసం ప్రజలకు అవగాహన కల్పించాలి. ఆచారాలతో చాలా మంది మృతదేహాన్ని కాల్చేందుకు ముందుకు రావడం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠధామాలు వినియోగంలోకి రావడంలేదు.

– శ్రీపాదరెడ్డి, గువ్వలదిన్నె

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

గ్రామాల్లో ఎవరైనా మృతిచెందితే మృతదేహాన్ని కాల్చేందుకు వారి కుటుంబ సభ్యులు ముందకు వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. దహన సంస్కారాలను కల్పిస్తున్నాం. అవసరమైన కట్టెలతో పాటు నీటి వసతి ఏర్పాటు చేయిస్తున్నాం. వైకుంఠధామాల వినియోగం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

విద్యుత్ మీటర్లు ఏర్పాటు..

కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల్లో బోరు మోటారు నిర్మించిన గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు దీపాలను అమర్చారు. కొన్ని చోట్ల అవి పనిచేయడంలేదు. ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో వినియోగం జరగడం లేదు.

ఐఐటీ విద్యార్థులకు సన్మానం


ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్టీయూ యూనియన్ నాయకులు

గద్వాల: జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల ఐఐటీ సీట్లు సాధించారు. వీరి ప్రతిభను కొనియాడుతూ.. ఎస్టీయూ యూనియన్ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు గోపాల్, జానకమ్మ దంపతుల కుమారుడు సాయిదీరజ్ బాంబే ఐఐటీలో సీటు సాధించాడు. రామేశ్వర్‌దాస్, యువతి దంపతుల కుమారుడు తరుణ్‌కుమార్ ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించాడు. ఆదివారం సాయంత్రం స్థానిక న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐఐటీ సీట్లు సాధించిన సాయిధీరజ్, తరుణ్‌కుమార్‌లను ఎస్టీయూ యూనియన్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ యూనియన్ నాయకులు వెంకటయ్య, సోమసుందర్‌రెడ్డి, కాంతయ్య, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిరప నారుకు 'చీర కట్టు'

పంటలను సాగుచేసిన రైతులు పొలంలో వేసిన మొక్కలను కాపాడుకోడానికి వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని గోకులపాడులో మిరప నారును సాగు చేస్తున్న రైతు నరసింహులు పశువులు, కుక్కలు, పందుల నుంచి మిరపను కాపాడుకోవడానికి మిరప బెడ్ల చుట్టూ చీరను కట్టాడు. పంటను కాపాడుకోడానికి కష్టాలు తప్పవంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

– మానవపాడు

ఘనంగా మల్లురవి జన్మదిన వేడుకలు


గద్వాలలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్


మల్దకల్‌లో..

గద్వాల అర్బన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ మల్లురవి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కేక్ కట్ చేసి మల్లురవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ధరూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా.మల్లు రవి జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శక్తి కాంప్లెక్స్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సరిత ఆదేశానుసారం ధరూరులో మల్లు రవి జన్మదిన వేడుకలు నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యన్న, వెంకట్రాములు, శ్రీహర్ష, వాహిద్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో..

మల్దకల్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో బస్టాండ్ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి మల్లు రవి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ధరూరు: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు డీఆర్ విజయ్, ధరూరు మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, యూత్ నాయకులు సంజీవ్ కలిశారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో వారు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసిట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు రమేష్, రాజు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మానవపాడు: మండలంలోని నారాయణపురంలోని బీఆర్ఎస్ కార్యకర్త శంకర్‌రెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉంటారని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీడ్ పత్తిపంట ధ్వంసం

మల్దకల్: మండల కేంద్రం మల్దకల్‌కి చెందిన కుర్వ తిరుమలేష్‌కు చెందిన సీడ్ పత్తి పంటను ఆదివారం అదే గ్రామానికి చెందిన ఐదుగురు ట్రాక్టర్‌తో పత్తి పంటను ధ్వంసం చేశారు. ఈ విషయమై తిరుమలేష్ సీడ్ పత్తి పంట ధ్వంసం చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలియజేశారు.


మల్దకల్‌లో ధ్వంసం చేసిన సీడ్ పత్తి పంటను చూపిస్తున్న రైతు తిరుమలేష్ కుటుంబ సభ్యులు

క్రీడా ప్రాంగణంలో సాగు



మస్తీపురంలో ఏర్పాటు చేసని క్రీడా ప్రాంగణం బోర్డు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. కానీ మండలంలోని మస్తీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేసినా.. ద్వారం నుంచి లోపలికి వెళితే అక్కడ క్రీడా సామగ్రి ఏది కనబడదు. అక్కడ పంటను సాగుచేస్తున్నారు. స్థలం తనదేనని గ్రామానికి చెందిన శివారెడ్డి ఇప్పటికీ రెండు సార్లు పంటలు వేయడం, అధికారులు వాటిని తొలగించడం జరిగింది. కానీ ముచ్చటగా మూడోసారి శివారెడ్డి అదే స్థలంలో పత్తి పంటను సాగుచేస్తున్నాడు. జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు పలువురు హౌర ఇది క్రీడా ప్రాంగణమేనా అంటూ అవాక్కవుతున్నారు.

ఒరిగిన స్తంభాలు.. సరిచేయని అధికారులు


చెన్నిపాడులో ఒరిగిన విద్యుత్ స్తంభం


మానవపాడు శివారులో ఒరిగిన విద్యుత్ స్తంభం

మానవపాడు: విద్యుత్ స్తంభాలు ఒరిగి ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం ఈదురు గాలులు, వర్షాలకు స్తంభాలు నేలకు ఒరిగే ప్రమాదం ఉంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు చొరువ చూపి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.